

# నోరుగల్ల ఆడది

ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు

ఎండకు ఎండీ వానకు నానీ చివికి సగం రాలిన తాటాకు పందిరి. పందిట వెనుక ఎత్తయిన రెండు తిన్నెలున్న పూరిల్లు. గాలికి అక్కడక్కడా రేగిపోయిన పూరికప్పు. తిన్నెలకు మాసి పెచ్చులు రాలిన ఎఱ్ఱమట్టి.

తిన్నెల మధ్య మూసి వున్న వెలిసిన ముదురాకు పచ్చరంగు చెక్క తలుపు. తలుపు అడ్డ పట్టీల మీద యింతింత లావు యిత్తడి గుబ్బలు. గుబ్బల మీద గారుకుపోయిన దుమ్ము.

వద్దొద్దు... ఆ తలుపు తీయద్దు. అట్లా వుండ నివ్వండి. దాన్ని, అట్లాగే. పాతికేళ్లుగా అట్లాగే దగ్గరగా మూసి వున్న తలుపు అది. యేరోజూ బార్లా తెరచు కోలేదు. దిగ్గున వెలిగే పగటి కాంతిని ఎన్నడూ అది ఆ పూరింటిలోకి అనుమతించలేదు. అట్లాగే వుండ నివ్వండి. దాన్ని తీయద్దు. వద్దొద్దు... లోపలంతా చీకటి సుడిగుండాలు. పోటెత్తే సముద్రాలు. రగిలే పర్వతాలు. వద్దు. వెళ్లకండి. ఆ తలుపు జోలికి. అది కట్టలు తెంచు కొని మిమ్మల్ని ముంచెత్తి వూపిరాడనీయక వుక్కిరిబిక్కిరి చేయచ్చు.

బహుశా కన్నీళ్లు కావచ్చు.

లేదా మరిగే లావా కావచ్చు.

యిదిగో, యీ పక్కగా... పిచ్చిపొదల మధ్య నడిచీ నలిగి యేర్పడిన కాలిబాట. రండి, నడపండి, యింటి వెనక్కి. అసలీ యింటికి యేళ్లకి యేళ్లు పరాయి మనుషులు నడిచిన దారి యిదే!

వెనక తలుపు కూడా వేసే ఉంది. సరే వుండ నివ్వండి. పూలూ పిందే లేని ఆకులు రాలిన యీ జామ చెట్టు కింద నీడలేదు. యిక్కడొద్దు. రండి. యిదిగో మీ ముళ్ల కంచె మీద ఎడమ కాలుపెట్టి బొప్పాయి చెట్టును పట్టుకుని అవతలికి దూకండి... యిట్టా!

ఫర్వాలేదు. యేంకాదు. మీ కాళ్లకి వుక్కు కవచా ల్లాంటి చెప్పులున్నాయి. వొక్క ముల్లూ గాయపరచదు మీ దేహాన్ని.

దూకండి.. ఆ... అట్లా...

క్షమించాలి మీరు, మిమ్మల్ని మా యింట్లోకి వెనక నుంచీ తీసుకువెళ్తున్నందుకు. అవును, యిదే మా యిల్లు.

యిప్పుడంటే యిది సిమెంట్ పూతలు పూసు కున్న మట్టిగోడల రేకులిల్లు. పాతికేళ్ల కింద మాత్రం పేడతో అలికిన గోడల నాటు పెంకుటిల్లు. యీ వెనక వసారాలో కుడిపక్కన కట్టెలపొయ్యి. పొయ్యి ముందు బొయ్యిబొయ్యిన వూపిరినంతా వూదరగొట్టంలోంచి వూదుతూ మా అమ్మ.

యిప్పుడీ యెడమ పక్కన దేవుడి పటాలున్న చోటుని పూజగది అంటున్నారు. అప్పుడిక్కడ వడ్ల బొట్టలుండేవి. పెద్దదొకటీ, చిన్నదొకటీ. తెల్లటి సున్నం పూసిన బొట్టలు. ఇంటి పక్కన దొంతర్లుగా పేర్చి నల్లకుండలు. యిదిగో సరిగ్గా యీ పెళ్లు వాకిలి దగ్గరే నేనూ మా అమ్మా యెండపూట అన్నానికి పీటలు వాల్చుకునేవాళ్లం.

*

''వంకాయి బజ్జి యింకొంచిం ఎయిమా,'' అన్నాను పళ్లెం ముందుకు సాచి. సట్టిలోంచి బజ్జి వేస్తుండగానే, "చిన్న ముక్కమా," అన్నాను గోజారుతూ.

"మనిషి కొకటే... లెక్కబెట్టి యేంచినా..." అనింది మా అమ్మ, తన పళ్లెంలోని యెండు చేపముక్కను

కొంచెం తుంచి నా పళ్లెంలో వేస్తూ. యింతలో దబదబ శబ్దం. పడతా లేస్తా పరుగున పెళ్లుదారిలో లోపలి కొచ్చి పడింది స్వర్ణక్క.

నేనూ మా అమ్మ బిత్తరతో లేచి నిలబడ్డాం.

అటూ యిటూ చూసి వడ్లబొట్టల చాటుకు పొయ్యి ముడుక్కుని నిలబడింది స్వర్ణక్క. ఎగరొప్పుతూ వుంది. వళ్లంతా చెమట. కళ్లనిండా భయం. "యేంది.. యేందివే," అంటూ మా అమ్మ ఆమె దగ్గరకు పోయింది. కుడిచేతిని నోటికి అడ్డంగా పెట్టి మాట్లాడద్దన్నట్టుగా సైగ చేసింది స్వర్ణక్క. మరుక్షణం మా అమ్మ వాకిలి తట్టు దూకింది. తలుపు చిలుకు పెట్టింది. అదే పరుగుతో పెళ్లు తలుపూ మూసేసింది. చీకటి కమ్ముకునింది. నేను ఎంగిలి చేతిని నిక్కరు జేబులోకి దోపేసి గోడకి అతుక్కుపోయి నిలబడ్డాను. వడ్లబొట్టల వెనుక కిటికీలోంచి లోపలికి సన్నని తీగలాగా వెలుతురు పడుతోంది. ఆ వెలుతురులో పరిసరాలు మసకగా కనిపిస్తున్నాయి. "మే... సొర్నా... తాగుమే..." అనింది మా అమ్మ. సరిగ్గా మా అమ్మ పట్టుకున్న నీళ్ల గ్లాసు మీద వెలుతురు పడుతోంది. చేయి వణుకుతోంది. స్వర్ణక్క గుటగుటా నీళ్లు తాగింది.

రెండు మూడు నిమిషాల పాటు అక్కడ యే శబ్దమూ లేదు.

మా అమ్మ వీధి వాకిలి దగ్గరకు వెళ్లింది.

శబ్దం రాకుండా మెల్లగా ఓరగా తలుపు తెరచింది. తల బయటకు పెట్టి అటూయిటూ చూసింది. నిమ్మళపడింది. తలుపు యింకొంచెం తెరిచింది. "చిన్నోడా..." అని పిలిచింది.

ఆ పిలుపుతో నాలో అదురు తగ్గింది. వాకిలి వైపు చూశాను.

"ఆడదాక పొయ్యి... చూసేసి రా బో," అనింది.

మెరుపులా తొట్టి దగ్గరికి పరిగెత్తి చేయి కడుక్కున్నాను.

చూసేసి రావలసిందేమిటో నాకు అర్థమయిపోయింది. "మందిరం కాడకి పోయినట్టే పొయ్యి యిట్ట చుట్టు తిరుక్కొనొచ్చెయ్యి," అనింది స్వర్ణక్క, బొట్ల వెనుక నుంచే.

"నిదానంగా పో," అనరిచింది మా అమ్మ.

మా సందు మొగదల నిలబడి రోడ్డుకి అటూ యిటూ చూశాను. పడమటి దిక్కుగా యిద్దరు పోలీసులు నడిచిపోతున్నారు. భయంతో వొక్కక్షణం నా వొళ్లు జలదరించింది. పోలీసులు మందిరం దాటారు. అక్కడొక్కరూ అక్కడొక్కరూ యిళ్ల బయట నిలబడి వాళ్లని చూస్తున్నారు. స్వర్ణక్క వాళ్ల యింటివైపు చూశాను. మనిషి అలికిడి లేదు.

ముదురాకు పచ్చరంగు వాకిలి తలుపు మూసే వుంది.

ఆ యింటిని దాటుకుని ముందుకు కదిలాను. మందిరం పక్కన వున్న కంకరరాళ్ల గుట్ట మీద కూర్చున్నాను. రాయితో రాయిని కొడుతూ ఆడుకుంటున్నట్టుగానే పోలీసులు ఎటు పోతున్నారా అని గమనిస్తున్నాను.

పక్క వాకిట్లో శీనయ్యా, పద్మమ్మ నిలబడి చూస్తున్నారు.

ఎదురుగా సైకిలు మీద వస్తున్న వొక మనిషిని పోలీసులు ఆపారు. కాసేపు మాట్లాడి ముందుకు కదిలారు. అతను కొంతదాకా సైకిలు నెట్టుకుంటూ వచ్చి ఎక్కాడు.

మందిరం దగ్గరకు రాగానే పద్మమ్మ అతన్ని ఆపింది.

"యెవురి కోసరమంట అబయా?"

వాళ్ల మాటలు విని నేను యింటికి పరుగందుకున్నాను.

బఱ్రున శబ్దం చేస్తూ వాకిలి తలుపు నెట్టి "సొర్ణక్కా... యేం బయింలా... దా... కా..." అన్నా పెద్దగా.

మా అమ్మ కోపంగా చూసింది నా వైపు.

"పెగ్గిలొద్దు గానీ చెప్పు," అనింది.

మా అమ్మని పట్టించుకోకుండా వడ్లబొట్టల దగ్గరికి వెళ్లి, "యింక... రాకా," అన్నాను. స్వర్ణక్క కదల్లేదు.

"మూసుకొని చెప్పు..." అని అరిచింది మా అమ్మ.

"మ్మో... వాళ్లు యాడా ఆగనేలేదు. నేరుగా బోతానే వుండారు. యాడికో తెలుసునా, మాదిగిళ్ల కాడికి, రాత్రి గలాటాలు జరిగిళ్లా వాళ్ల కోసరం లే," అన్నాను.

"నువ్వు బాగా చూసినావా," అనడిగింది స్వర్ణక్క బొట్టల వెనుక నుంచే.

"క్కో," అన్నాను, నన్నే శంకిస్తావా అన్నట్టుగా.

సొర్ణక్క బయటకొచ్చింది. భయం ఆమె ముఖాన్ని యింకా వీడనేలేదు. నా కళ్లలోకి చూసి మా అమ్మ వైపు తిరిగింది.

మా అమ్మ వెనుక తలుపు పూర్తిగా తెరిచింది.

''చిన్నోడా, చూసింది చూసినట్టు నిదానంగా చెప్పు,'' అనింది.

"అమా... నిజ్జం మా. వాళ్లు మాదిగిళ్ల కాడికే పోతా వుండారు మా..." అన్నాను సత్యం చెప్తున్నట్టుగా నెత్తిన అరచేయి పెట్టుకుని.

మా అమ్మ స్వర్ణక్క వైపు చూసింది.

"చినమ్మా, ఆ నా బట్టల్ని నమ్మనే నమ్మలేం. ఆ పక్కా యీ పొక్క జూడకుండా నేరుగా ముందుకు పోయినట్టే పొయ్యి దడీమని యేదో వొకింట్లో దూరెయ్య బోతారు,'' అనింది స్వర్ణక్క.

"మాదిగిళ్ల కాడికని నీకెవురు జెప్పినారు వాయ్,'' అని క్రాస్ చేసింది మా అమ్మ.

''మ్మో... నిజ్జం చెప్తే నమ్మరుగదా. మాదిగ పోలయ్య సైకిలు మీద పేటకి పోతా వుంటే పోలీ సోళ్లు ఆపి, 'రాత్రి గలాటా జరిగిన చోటు యెక్కడా,' అనడిగినారంట''.

"ఆయన్న పద్మక్కతో చెబ్తా వుంటే యీ చెవిల్తో ఇన్నానమ్మా,'' వుక్రోషంగా అన్నాను. ఆ మాటతో స్వర్ణక్క ముఖం తేటబడింది. వాతావరణం తేలికబడింది. స్వర్ణక్క పీటని దగ్గరికి లాక్కుని గొంతుక్కూర్చుంది.

మా అమ్మ తిరిగి అన్నం గిన్నె ముందు కూర్చు నింది.

''రా... చిన్నా... బడిగెంట కొట్టే టమయితా వుంది. తినేసి పో,'' అని పిలిచింది.

నేను నేలమీద కూర్చుని పళ్లెం దగ్గరికి లాక్కు న్నాను.

''మే... సొర్నా... బయట కుండలో నీళ్లట్ల ముంచుకో'' అని యిత్తడి తపిల స్వర్ణక్క చేతికిచ్చింది మా అమ్మ.

ఆమె నీళ్లకు లేవగానే యెండు చేపలున్న ప్లేటుని బిందె చాటుకి నెట్టేసింది.

స్వర్ణక్క నీళ్ల తపిల మా అమ్మ ముందు పెట్టి నిలబడింది.

"తిన్నావంట మే,'' అనడిగింది మా అమ్మ.

"లేదు చిన్నమ్మా... కూటికి కూచ్చోబోతా వుంటే టీ యంగిడి నాగమ్మొచ్చి చెప్పింది. 'పోలీసోళ్లు వూళ్లో కొస్తావుండారంట. మా పిలగోడు సైకిలు మీదొస్తా చూసి నాడు,' అని. అంతే మా యమ్మ అగిత్తం ముండగదా. యింకన నిలవనీలా నన్ను. పెళ్లు పక్కనుండికొనింది. గీరుకుపోయిన చారల్లో అక్కడక్కడా నెత్తురు వూరు తోంది.

''సరే తినుబో యింక,'' అని నావైపు తిరిగి, "యింకొంచిం అన్న మేసేదా,'' అనడిగింది మా అమ్మ.

''వస్తాను చిన్నమ్మా,'' అని బయలుదేరింది స్వర్ణక్క.

ఆమె వాకిలి దాటీ దాటకముందే-

"తెగించిన లంజిలు గదా యిదీ, దీనమ్మా,'' అని గొణిగింది.

ఆ మాటలు స్వర్ణక్కకి వినిపించే వుంటాయి.

"రే చిన్నోడా... దీని యేసికాలకేం గానీ... తినేసి పొయ్యి పెళ్లో ముళ్లకంప సరిగా యేసేసిరాబో... యిది బరిగొడ్డు మాదిరిగా తొక్కేసొచ్చేసుంటాది. గొడ్డూ గోదా కన్నా యీ లంజివల్లే గదా యెలుగు నాసినం బట్టి బోతా వుండేది,'' అనింది మా అమ్మ అన్నం ముద్దని యెగేసి యెగరేసి తింటూ.

*

వేపచెట్టు నీడ వొంటికి చాలా మంచిదంటారు. రండి, కాసేపు యీ నీడన చేరుదాం. అవును నీడ తక్కువగానే వుంది. చెట్టు సగం బోడిగా వుంది. ఎన్నో తుఫానులను ఎదురొడ్డి, రెమ్మలు రాలినా, కొమ్మలు విరిగినా యింకా సజీవంగా నిలబడ్డ మహావృక్షం యిది. తిన్నెలాగా విస్తరించిన యీ వేళ్లని చూస్తే దీని వొకనాటి మహారూపం కళ్లకు కడుతుంది. యీ వీధికి అతిథులను మోసుకొచ్చే కార్లూ, రిక్షాలూ యీ నీడనే విశ్రమించేవి.

అదిగో ఆ ముదురాకు పచ్చరంగు చెక్క తెలు పున్న పూరింటి ఎదురుగా వున్నదే చిన్న మిద్దిల్లు... అది మా అత్తది. మా మిద్దింటత్తది. రండి రండి మిద్దింటి వరండాలో కూర్చుని కొత్తకుండలోని చల్లని నీళ్లు తాగుదాం!...

యిదిగో యీ పెంకుల వరండా వున్నచోటే గతంలో తాటాకు పందిరి వుండేది. పందిట్లో సరిగ్గా మీరు కూర్చున్న వైరు మంచం వుండే... యిక్కడే, నులక మంచం ఎల్లికిల్లా వేసి ఎండపూట మా అత్త నడుం వాల్చేది. యీ చివర పందిటి గుంజను ఆనుకుని నీల మణెమ్మ కూర్చునేది. మధ్య గుంజ మనోరంజనవ్వది. యీ ఎల్లరాయి మీద విశాలాక్షత్త కూర్చునేది. వరండా మెట్టు మా అమ్మది. మా అత్త పక్కన మంచం పట్టె మీద చోటు నాది.

*

''నీలమణా ఆ సవితి అగసాట్లు జూడో...'' అనింది మా మిద్దింటత్త, నులక మంచం మీద ఎల్లకిలా పడుకుని నవ్వు బిగబట్టుకుంటూ.

ముదురాకు పచ్చరంగు చెక్కతలుపున్న పూరింటి తిన్నెమీద కూర్చోనుంది మా విజయ పెద్దమ్మ, పడమటి దిక్కుగా రోడ్డు మీదికి చూస్తూ...

ఎండకి ఆ రోడ్డు ఆవిర్లు కక్కుతూ వుంది. ప్యాంటూ షర్టూ వేసుకున్న వొకాయన వెనక్కి వెనక్కి చూస్తూ పోతున్నాడు.

మందిరం ఎదురుగా కానుగచెట్టు నీడలో బేబక్క నిలుచోనుంది. యింకొంచెం అవతల పెంకుటింటి బయట పాపక్క వాళ్ల అమ్మ నిలబడి వుంది. ఆ ఎదురుగా రాజక్క వుంది. యింకా దూరంగా అక్కడక్కడా యిళ్ల ముందు వొకరిద్దరున్నారు. ఎండకి మసగ్గా వుంది.

''మే... యిశాలా చూడు. విజయమ్మ యేషాలు,'' అనింది మా అత్త. అందరూ అటు చూశారు. ఆమె మా పందిటివైపు తిరిగింది.

గబుక్కున అందరూ తలలు తిప్పుకున్నారు.

''రే... పో... ఎదవా,'' అని కసరింది మా అమ్మ.

నేను లేచి మిద్దింటి సిమెంట్ స్తంభం వెనక్కి వెళ్లి నిలబడ్డాను.

''అమ్మే... చూడు చూడు...'' అని అనింది గుస గుసగా మా అత్త.

విజయమ్మ తాటాకు పందిటి కింద నిలబడి కుడి అరచేతి బొటనవేలితో నడినెత్తిన గీరుకుంటూ వుంది.

గీరుకుంటూ గీరుకుంటూనే రోడ్డు మీద వెళుతున్న మొగమనిషి వెనక్కి తిరిగి చూసినప్పుడు మాత్రం మిగిలిన నాలుగేళ్లతో పిలుస్తున్నట్టుగా సైగ చేస్తోంది. మామూలుగా చూస్తే మాత్రం ఆమె తల గీరుకుంటున్నట్టే వుంది.

జాగ్రత్తగా గమనిస్తేనే ఆమె ఎవర్నో పిలుస్తోందని అర్థమవుతుంది. మధ్య మధ్యలో విజయ పెద్దమ్మ మా పందిటివైపు చూస్తోంది. రోడ్డు మీద వెళ్తున్న మనిషిని ఆకర్షించడానికి ఆమె పడుతున్న అవస్తలు చూసి మా అత్తా, మా అమ్మా మిగిలిన వాళ్లూ శబ్దం బయటకు రాకుండా కిసకిసా నవ్వుతున్నారు.

''మెడ్రాసోడు మందిరం దాటేసినాడు. యిజియమ్మ చాన్సు పోయింది బో,'' అని నవ్వింది నీలమణెమ్మ.

''అంత సులువుగా వొదిలి పెట్టెయ్యబోతాదా యేమి,'' అనింది మా అత్త.

యింతలో మెడ్రాసాయన దగ్గరికి పాపక్క కొడుకు పరుగెత్తుకోని వచ్చాడు. యేందో మాట్లాడాడు. ఆయనని యింటికి పిల్చుకోని పొయ్యాడు.

''పాపమ్మ పంట పండింది మే,'' అనింది విశాలాక్షమ్మ.

''ఆపీసరు మాదిరిగా వుండాడు. దండిగానే గిడతాది లే,'' అనింది మా అమ్మ.

''యేం గిట్టేదో... యేందో... అగుడుబట్టి బోతా వుళ్లా యీ మనుషులు. యేం బాద యిది? యేమిటికి యీ కర్మ? మేం వొయిస్లో వుండేపుడు యిట్టుణ్ణిందా? యెవురో వొకరి యిలాకాగా వుండిపొయ్యేవాళ్లం గదా. పెట్టినా తిట్టినా అదే సుకం చినపిల్లా... యేమంటావు?'' అనింది మనోరంజనవ్వ మా అత్తతో.

''గమ్మునుండండి... గమ్మునుండండి... దాని కూతురొస్తా వుండాది. దాని నోట్లో బడ్డామంటే యింక నంతే. మనల్ని నడీదిలో బెట్టి కడిగెయ్యబోతాది,'' అనింది మా అత్త లోగొంతుకతో హెచ్చరికగా.

బిందె చేంతాడు పట్టుకుని స్వర్ణక్క వస్తోంది. ముఖం కడుక్కుని జడ వేసుకుని పౌడర్ రాసుకుని వచ్చినట్టుంది.

''చూడు దాని కులుకు,'' అనింది నీలమణెమ్మ. మాట్లాడద్దన్నట్లుగా మా అత్త కళ్లతోనే సైగ చేసింది. మిద్దింటి పక్కనే వీధి బావి. స్వర్ణక్క కాళ్లగజ్జల శబ్దం దగ్గరయింది. వేపచెట్టు కింద వున్న రిక్షా వైపు చూస్తూ నడుస్తోంది స్వర్ణక్క. రిక్షాలోంచి వొక మొగమనిషి దిగి నిలబడ్డాడు.

పందిరి కింద గుసగుసలు.

స్వర్ణక్క బావి గట్టు మీద బిందె పెట్టి రిక్షాలోంచి దిగిన మొగాయన వైపు చూసి నవ్వుతోంది.

''అదీ కత... యీ నడి యెండపూట యీ నైసు గత్తె కులుక్కుంటా కులుక్కుంటా నీళ్ల కెందుకొచ్చిం దబ్బా అనుకున్నా. రిక్షాలో మెడ్రాసోడు. యింకోడున్నాడన్నమాట. వొకిడ్ని పాపమ్మ యెగురేసుకొని బోయింది. రెండోవాడి కత జూడండిక,'' అనింది విశాలాక్షత్త మెల్లగా. స్వర్ణక్క చేంతాడు చుట్ట విప్పింది. వుచ్చు ముడేసి బిందెకు బిగించింది. గిలక్కివేసి బావిలోకి దించింది. గలగల శబ్దంతో బిందె బావిలోకి దిగింది. యెండ మండిపోతోంది. కాళ్లకి చెప్పుల్లేవు. యెంతో నిదానంగా ఆమె నీళ్లు చేదుతోంది.

''దీని వొయ్యారం జూడు మే... బింది బాయిలో ముంచనూ లేపనూ... ముంచనూ లేపనూ... బయటికి చేంతా వుండాదేమో జూడు. అదొచ్చిందసలు నీళ్ల కోసరమయితే గదా,'' అనింది మా అత్త.

బావి గిలక శబ్దంలో ఈ మాటలు స్వర్ణక్కకి వినిపించే అవకాశం లేదు. తిన్నె మీద కూర్చోనున్న

విజయ పెద్దమ్మ కాసేపు కూతురివైపు, కాసేపు రిక్షా లోంచి దిగిన మెడ్రాసాయన వైపూ చూస్తోంది. యెంతో అసహసంగా వుంది ఆమె. మధ్యలో మా పందిటివైపు రుసరుసలాడే చూపులు విసురుతోంది.

రిక్షాలోంచి దిగినాయన బెరుకు బెరుకుగా మా విజయ పెద్దమ్మ వైపు చూస్తూ బావి దగ్గరకు నడిచాడు. విజయ పెదమ్మ దిగ్గున యింట్లోకి పొయ్యి కాళీ బిందెతో సరసరా బావి దిక్కు నడిచింది.

''అమ్మాయా... యెండ జూడో... కాలిపోతా వుంది. నువ్వింట్లోకి బో... నీళ్లు నేను తెస్తాగానీ,'' అని కూతుర్ని పంపేసింది.

మెడ్రాసాయన బావి అవతలి గట్టున నిల బడ్డాడు.

యేం కావాలన్నట్లు కళ్లతోనే ప్రశ్నించింది విజయమ్మ.

అతని కళ్లనిండా బెదురు.

''...తణ్ణీ'' అన్నాడు.

''ఇంగిల్లె... వా... వా వీట్లె పసితణ్ణీ యిరిక్కిదు... వా... వా...'' అని ఆమె యింటివైపు చూపింది.

''మే లెయిండి మే... యింకనిక్కడుంటే మన బయిసి దక్కదు. ఆ మనిషి వుత్తబెదురు గొడ్డు మాదిరిగా వుండాడు. మనవల్ల బేరం చెడిందనుకో... ఆ యమ్మా కూతుళ్లు యీ దినమంతా యింక యాదిలో రామాయణం బెట్టేస్తారు. అయినా ఆ వుసురు మన కెందుకులే గానీ పదండట్ట కొంచేపు లోపలికి బోతాం గానీ,'' అని లేవదీసింది మా అత్త. అందరూ యింట్లోకి పొయ్యారు.

నేను మాత్రం స్తంభం చాటు నుంచి కదల్లేదు. మా అమ్మ నన్ను గమనించలేదు.

నా చూపంతా బావి మీదే వుంది.

అంతకు ముందే అదే రిక్షాలోంచి దిగిన మనిషి వెళ్లిన వైపు మెడ్రాసాయన మాటమాటికీ చూస్తున్నాడు.

విజయమ్మ బిందె నడుం కెత్తుకునింది. పందిటి వైపు వొకసారి చూసింది. వీధంతా కలియజూసింది. వీధి నిర్మానుష్యంగా వుంది.

గబగబా మెడ్రాసాయన దగ్గరకు వెళ్లింది.

''వా... వాంగో,'' అని చేయి పట్టుకుని యింటి దిక్కు లాగింది. అతను బిత్తరచూపులు చూశాడు.

ఆమె చేతి పట్టు సడలలేదు. అతడు బెదురు బెదురుగానే ఆమె వెంట నడిచాడు. ఆమె అతనికి యింటి వెనక్కి దారి చూపింది. తను వీధి తలుపు నెట్టి లోపలికి వెళ్లింది. మరుక్షణమే ముదురాకు పచ్చరంగు చెక్క తలుపు కిర్రు చప్పుడుతో మూతపడింది.

*

చల్లని కుండనీళ్లు తాగినా లోలోపల సెగలు సెగలుగానే వుంది. కడుపులో దిగులు దిగులుగా వుంది. ఆవేదనగా వుంది. జ్వరం కాస్తున్నట్టుగా వుంది. నాని, ఎండి, చివికి, రాలి, గాలికి రేగిన తాటాకు పందిరీ. వెలిసిన ముదురాకు పచ్చరంగు చెక్క తలుపూ యేళ్లనాటి వేళ్లుతేలిన బోడి వేపచెట్టూ ఎర్రటి యెండలో బావి గట్టు మీద దిసపాదాల ఘల్లు ఘల్లు శబ్దాలూ పౌడరు వాసనా... అవును కడుపులో దిగులు దిగులుగానే ఆవేదనగా వుంది. రండి... రండి... కొంచెం దూరంగా పోదాం... నిర్మాణంలో వున్న ఆ మందిరంలోకి.

యిటుకరాళ్ల గుట్టా సిమెంట్ పూతల వాసనా చల్లని నున్నని నాపరాయి పరిచిన నేలా... తెరిపిగా వుంది కదా. హమ్మయ్య కాసేపు యిక్కడ కూచోవచ్చు.

హబ్బ... యేదో పాత వాసన... గబ్బిలాల వాసన... పెళ్లలు పెళ్లలుగా రాలిన సున్నం పూతలోంచి రేగిన దుమ్ము వాసన.

అవునవును. యిప్పుడీ మందిరం కడుతున్న చోట వొక శిథిల మంటపం వుండేది. మంటపం మధ్యలో చిన్న గర్భగుడి. గర్భగుడిలో వెంకటేశ్వరుడి పటం. పిల్లల ఆటలన్నీ యిక్కడే. తలుపులూ వూచలూ లేని కిటికీలు. సందులో బాడిసెచెట్టు. వేపచెట్టు. కోతి కొమ్మచ్చి... అవుస్ బాయ్... దాకుళ్లూ మూకుళ్లూ... ఆటలు... అరుపులు... అల్లరి నవ్వులు... అలకలు... కొట్లాటలు...

*

'అంబాలీస్' అని అరుస్తూ గర్భగుడిలోంచి బయట కొచ్చిపడ్డాడు ముక్కు తిమ్మడు. ''నేను గూడా అంబాలీస్,'' అంటూ వెనకే చెమటలు పోసుకుంటూ బయటకొచ్చింది మునిలక్ష్మి.

ముక్కు తిమ్మడి వొళ్లంతా చెమట ముద్దయి పోయింది. వగరుస్తూ... యేడుస్తూ... ''దొంగలంజి... గండుపిల్లి మాదిరిగా పట్టుకొని గీకేసింది... గోళ్లుజూడు రాచ్చేసిముండా,'' అన్నాడు ముఖాన్ని చేతులతో తడుముకుంటూ. మునిలక్ష్మి కోపంగా చూస్తూ నిలబడింది. ''మీ యక్కతో చెబ్తా నుండు...'' అన్నాడు వాడు.

''దొంగ నాబట్టా... అసలే బయింబిత్తల దాన్నయితే... చీకట్లో బట్టుకోని పిసికేస్తే వూపిరెట్టాడతాది వాయ్,'' అనరిచింది కసిగా.

''మొండి... మొండి... యెవురో వొకరు మీ యిద్దర్లో అవుటవ్వాల్సిందే,'' అన్నాను నేను అదేమీ పట్టిచ్చుకోకుండా. ఆ ఆటకి దొంగ పెట్టింది నేను. నిజానికి మా ఆట నిబంధన ప్రకారం గర్భగుడిలో దాక్కో కూడదు. మునిలక్ష్మి, ముక్కుతిమ్మడూ యిది పాటించ లేదు. నన్ను ఆ యిద్దరూ పట్టిచ్చుకోనేలేదు. మిగతా పిలకాయలెవ్వరూ మందిరం లోపల లేరు.

వీళ్లిద్దరూ కొట్లాడుకుంటూనే వున్నారు. యిదిట్లా యిళ్లదాకా పోతే... హమ్మో! యింతే సంగతులు. పెద్ద గలాటాలు జరిగిపోతాయి. రచ్చలే రచ్చలు... యీ భయం నాలో లోపలికి ప్రవేశించి నన్నాక్రమిస్తుండగానే మందిరం బయట అరుపులూ కేకలూ వినబడ్డాయి.

వొక్క పరుగున మందిరం స్తంభం చాటుకు పొయ్యి నిలబడ్డాను. మునిలక్ష్మీ ముక్కు తిమ్మడూ కూడా నా వెనక చేరారు.

''గుడిసేటి లంజా... యింక నోరు తెరిచావంటే కుతిక మీద కాలేసి తొక్కేస్తా... ముయ్... ముయ్యింక,'' అని అరుస్తున్నాడు మునసబు మునిరామయ్య. ఆగ్రహంతో ఆయన శరీరం వణుకుతోంది. ఆయన తిడుతున్నది విజయమ్మని. ఆమె కూడా రోడ్డు మీద నిలబడి అరుస్తోంది. ''మున్రామయ్యా, నూరో తూరి జెప్తా వుండా... నీ పెళ్లాన్ని బయటికి రమ్మను. కరుపూరం ఎలి గించమను. యీద్దేవుడిమీద ప్రెమాణం జేసి నిజం చెప్పమను. నాది తప్పయితే నేను నాసినం అయిపోతా. నీ పెళ్లాం అపద్దం చెబ్తే- నువ్వూ నీ పెళ్లాం బిడ్డలూ మట్టిగొట్టుకుపోతారు.''

''యెదవముండా... యేందే... కూస్తావుండావు. నా పెళ్లాం ప్రమాణం జెయ్యాల్నా... సంపాదిచ్చుకునే ముండల్లారా... దినమ్మూ తలకాయ నొప్పయిపోతుండాదే మీతో... యెదవ కూతలు గూసేది. యవ్వారాలకొచ్చేది. రౌడీలంజిల్లారా... యింకను నోళ్లు యినపడ్డాయంటే రిపోట్టు రాసి జైల్లో బెట్టిచ్చేస్తా...''

విజయమ్మ కొంచెం కూడా తగ్గలేదు.

''పెద్దమనిషి గదాని మర్రేదిస్తా వుంటే, మాట చెవి నేసుకుంటా వుండావా... యింట్లోది బంగారం యీది లో నిప్పా... నేను యీదిలో నిలబడి మాట్లాడేది యిని పిస్తా వుండాదిగాని, యింట్లో జేరి నీ పెళ్లాం కూసే కూతలు యినపళ్లా? చెవల్లో సీసం బోసుకోనుండావా... ముందా నోరు ముయ్యించు మొగోడివైతే...'' అని సవాలు విసిరింది.

మునసబుకి అవమానం అయిపోయింది. ''యిక్కడ మొగోణ్ణి నేను మాట్లాడ్తా వుండాను గదా. మూస్కో నోరు,'' అని యింట్లోకి చూసి అరిచాడు. తిరిగి విజయమ్మ వాళ్లింటి వైపు తిరిగి ఆడముండలు గదా పోనీలే అనుకుంటా వుంటే మితిమీరిపోతా వుండారు. యింకొక్క మాట ఎక్కువ మాట్లాడినా నోటిమీద వాతలు పెట్టిస్తా. ఎదవబతుకు బతికే ముండలకు గూడా పెద్ద రోసాలొస్తావుండాయే పొడుసుకోని,'' అని బెదిరించాడు వేలు చూపుతూ.

మా విజయ పెద్దమ్మ తక్కువ తినిందా. ''నీ పెళ్లాం నోటిమీద బెట్టు వాతలు నీకు దమ్ముంటే. నువ్వు పెద్దమనిషివి గదా... పెద్దమనిషి మాదిరిగానే వుండాల్నా లేదా. తైక్కమంటే మా మీదకెందుకొస్తా వుండేది. మంచో చెడ్డో మా బతుకు మేం బతకతా వుండాం. 'అయ్యా సామి దయతలపమ'ని నిన్నేనాడన్న దేబిరించామా. నీ కూటికి ఆసి పడినామా. నీ నీళ్లకి ఆసి పడినామా. మా మీదకెందుకని కాలు దువ్వేది. మాట్లా డితే పోలీసోళ్లని అలపిచ్చేది. ఆ నాబట్టలొచ్చి మమ్మల్ని యీడ్చుకొని బొయ్యేది. దండుకోని వొదిలేసేది. తెల్ల పై గుడ్డేసుకోని తిరిగే నా బట్టలంతా... ఎందుకని మా మీదబడి సచ్చేది...'' విజయమ్మ గొంతు రుద్దమయింది.

''సంపాదించుకునే ముండలు.. సంపాదించుకునే ముండలు అని వొకటే రోదన. యేం సంపాదించుకోని, మిద్దిలు మేడలు గట్టినాం సారూ యీ బూమండలం మీద. యెవురి గడపలు దొక్కి యెవురి కొంపలు గూల్చినాం నాయినా... ఆ కొంపా యీ కొంపా గూల్చి మిద్ది మీద మిద్ది గట్టి నోళ్లంతా పెద్దమనుషులు గానే వుండారు. యేం. నీ దెగ్గిరి నూరో యిన్నూరో తండలికి దీసుకోని కూట్నీళ్లకి నా యింటిని నీకు దార బోయిలేదనే గదా నీ అక్కసంతా'' అని విరుచుకు పడింది.

ఇంతలో ముదురాకు పచ్చరంగు చెక్క తలుపు తెరుచుకుని స్వర్ణక్క బయిటికొచ్చింది. వచ్చీ రావటం తోనే, ''మే... నువు రామే... యింట్లోకి. యెదవ నా బట్టల్తో మనకేమిటికి. చీకటిపడ్డాక మన గుద్దెనకాల తిరిగే నాబట్టలంతా పొగులు పెద్దమనుషులే...'' అనింది వీధిలో నిలబడి. మునసబు మునిరామయ్య యింక వొక్క క్షణం అక్కడ నిలబడలేదు. 'ఛీ... థూ' అని రోడ్డు మీద వూసి, గొణుక్కుంటూ యింట్లోకి వెళ్లిపోయాడు. ఆయన లోపలికి వెళ్లిపోయాక కూడా కొంతసేపు అమ్మా కూతుళ్లు యిద్దరూ నడివీధిలో నిలబడి కడిగిపోశారు.

నేను మందిరం దగ్గర నుంచి వొక్క లగవున మా మిద్దింటత్త పందిరి కిందికి చేరాను. అక్కడ యీ గొడవ మీదే మాటలు నడుస్తున్నాయి.

"వొక చిన్నని లే. వొక పెద్దని లే. కావరంబట్టి పోయిండాదికా వీటికి," అనింది నీలమణెమ్మ.

"యిడిసి పెట్టిన ముండలు... రంకెలేస్తా దూకతా వుండాయి జూడు మా," అనింది మా అత్త.

"గెజ్జిలి గుర్రాలు గదా యివి," అనింది మా అమ్మ. ఎగతాళిగా నవ్వి, "యింత నోరుగల్ల మనుషులు యే దేశానా వుండరు కా," అనింది అప్పుడే వచ్చిన విశాలాక్షత్త. వక్కాకు నవులుతూ వుంది. కొంగు ముడివిప్పి రెండాకులు తీసి మా అత్త చేతిలో పెట్టింది.

"రే... బక్కమామా... గూట్లో డబ్బీ వుంటాదిగానీ వక్కొకటి తీసకరా బో," అని నాకు పని పురమాయించింది మా అత్త. వక్కను రాయితో కొట్టి పొడిగా చేసి ఆమెకిచ్చాను సున్నం డబ్బాతో పాటుగా.

"వొక మంచి లేదు. వొక మర్రేద లేదు. అగుడు బట్టి పోయినారు గదా వూళ్లో యీ అమ్మా కూతుళ్లు," అనింది విశాలాక్షత్త.

"వొక చేపల బుట్ట గాదు. వొక పండ్ల బుట్టగాదు. ఐసుబండోడు గాదు. కజ్జూరపండోడు గాదు. ఆ పందిటి ముందుకెవురొచ్చినా... ఆ యమ్మాకూతుళ్ల నోళ్లలో కడిగిచ్చుకోకుండా కదిలే పనే లేదుగదా," అనింది మా అత్త వక్కాకు నవల్తా.

"ఆ అమ్మాకూతుళ్ల పేరు జెబితే కారి వూంచే వాళ్లేగానీ... వొక మంచేమి వొక చెడ్డేమి అని అక్కరకొచ్చి అడిగేవాళ్లు ఎవురైనా వుండారు కా... యీ వూళ్లో," అనింది నీలమణెమ్మ.

"అబ్బో అనేవాళ్లేగానీ అయ్యో అనేవాళ్లు లేరు గదా," అని జాడించింది మా అత్త.

"కాలం... కాలం మిడిమేలంగా వుండాది. యెవుర్నని యేం లాబం... ముందు కాలం యిట్టుణ్ణిందా... ఎవురి పన్లు వాళ్లు జేసుకుని బతకతా వుండె. యిట్ట వొకరి మీదొకరు కత్తులు దూసుకుంటా వుణ్ణా. వీటికి సరే సిగ్గూ శరమూ లేదు. పెద్దమణిసి గదా అని మున్సిబుకేం వొచ్చింది. నోటికెంత కూతొస్తే అంత కూయడమేనా. ఆ పెళ్లాం వుండాదే... అది యింకా అగిత్తం ముండ. తంటాలు బెట్టేసి తమాస జూస్తా వుండాది జుడే యింట్లోజేరి..." అనింది మనోరంజనవ్వ పందిటి గుంజని ఆనుకుని కూర్చుంటూ.

"అది గూడా నిజమేలే... కా," అనింది మా అమ్మ వెంటనే. యింతలో ముదురాకు పచ్చరంగు తలుపు తెరుచుకున్నది. విజయమ్మ బయటకొచ్చింది. ఎదురుగా పందిట్లోకి చూసింది. మునసబు మునిరామయ్య యింటివైపు చూసింది. వేపచెట్టు పక్క చూసింది.

"యీ వూరి లంజలికి వొక పనాపాటా... తిన్న దరక్కా యెవురో వొకర్ని ఆడిపోసుకునే పనేగదా పొగలూ రెయ్యంతా," అనేసి ఇసురుగా లోపలికి వెళ్లిపోయింది.

ముదురాకు పచ్చరంగు చెక్కతలుపు దడీమని మూతబడింది.

*

యీ మందిరం పక్కనున్న రెండంతస్థుల మేడ మునసబు మునిరామయ్యది. యిక్కడి నుంచీ వరుసగా వున్న నాలుగిళ్లనీ గమనించండి. పాత పెంకుటిళ్లు. వొక్క రకంగా వున్నాయి గదా! మంచి పనితనం గల చెక్క తలుపులు. ఆ ముదురాకు పచ్చరంగు తలుపుల్లాగే యివి కూడా వొకప్పుడు వోరగా వేసే వుండేవి. యిప్పుడా అవసరంలేదు. యీ యిళ్లు పరాధీనమయ్యాయి. యీ యిళ్లలోని వాళ్లు కోనేటి కట్టన జీలగముళ్ల తోపులోని పాకల్లోకి మారారు.

...యేదో లారీ వస్తున్నట్టుంది. కొంచెం వారగా నడవండి యెర్రటి దుమ్ము. యీ బాట మీద లారీల రాకపోకలు జాస్తి. యిక్కడి యెర్రమట్టి దిబ్బల నుంచి గ్రావెల్‌ను మోసుకెళుతుంటాయి. లారీతోపాటూ రేగే యెర్రదువ్వకి బళ్లూ చెట్లూ ఎర్రబారాయి. తప్పుకోండి పక్కకి... లారీ మీదకొచ్చేట్టుంది... రండి... యీ ముదురాకు పచ్చరంగు తలుపు ముందున్న తాటాకు పందిట్లోకి... అరే... పసుప్పచ్చని బెంజి లారీ... అచ్చం... అదే లారీ...

అవును... సరిగ్గా యిక్కడే... యిక్కడే యీ పందిటి గుంజపక్కనే ఆగేది పసుప్పచ్చటి బెంజి లారీ. డ్రైవర్ గోపాలయ్యకీ, క్లీనర్‌కీ, పైనున్న పనివాళ్లకీ చల్లని నీళ్లు అందేవి. నీళ్ల కోసమేగాక విశ్రాంతి కోసం కూడా ఆ లారీ తరచూ అక్కడ ఆగేది. ఆ తరువాత డ్రైవరు గోపాలయ్య ఆ యింట్లో మనిషయ్యాడు. సన్నటి మనిషి నోట్లో చుట్ట. తలకి చుట్టిన పై గుడ్డ. పందిటి ముందు పసుప్పచ్చటి బెంజిలారీ.

వుదయపు కాంతిలో పసుప్పచ్చటి ఆ బెంజి లారీ బంగారు పూత పూసినట్టుగా మెరిసిపోతూ వుండేది. ఆ యింటికి వొక అలంకారంగా అమరిపోయింది అది.

*

పసుప్పచ్చటి బెంజిలారీ కేబిన్‌లోకి పందిటి లోంచి అన్నం కేరియర్ అందుతోంది. చూస్తూ నిలబడ్డాను నేను.

"వొస్తావా... రా..." అన్నాడు డ్రైవర్ గోపాలయ్య, చుట్ట పొగ గప్పున వదిలి. నేను విజయపెద్దమ్మ వైపు ఆశగా చూశాను.

"యెక్కబో... పో... అబయా... మీ బావ... గోపాల బావ..." అని భరోసా యిచ్చింది విజయ పెద్దమ్మ. పరుగున లారీలోకి చేరుకున్నాను. యెర్రమట్టిదిబ్బల్లో మట్టిపోశారు లారీలో. తిరుగు ప్రయాణంలో అదే పందిట్లో దించారు. గొప్పగా వుంది. వుత్సాహంగా వుంది. అక్కడి నుంచీ మా యింటికి నేనే సొంతంగా లారీ నడుపుకుంటూ బయలుదేరాను -

"డుర్... ర్ర్... ర్ర్... పొయ్యాం... పొయ్యాం..." అనుకుంటూ.

వాకిట్లో మా అమ్మ అత్తా కరేపాకు కట్టలు కడుతున్నారు. దారికి అడ్డం.

"పొయ్యాం... పొయ్యాం... పొయ్యాం..." అంటూ నోటితో హారన్ మోగించాను. "పోరా బక్కోదవా" అనింది మా అత్త బోసి నోటితో నిండుగా నవ్వుతూ.

"యింకను దిగు నాయినా... లారీ... మాకు తెలుసుగానీ తమరు గోపాలయ్య లారీలో ఎర్రమట్టి దిబ్బలు కాడికి పొయ్యొచ్చారని," అనింది మా అమ్మ నవ్వు మొఖంతో.

లారీ అనుభవాన్ని వల్లించే అవకాశం లేకుండా పోయినందుకు కోపం వచ్చింది నాకు. మౌనంగా వెళ్లి గోడవార చతికిలబడ్డాను. "గోపాలయ్య డ్రైవరు యేం మాట్లాడినాడు రా," అనడిగింది మా అమ్మ నన్ను మాట్లాడించాలనే ఉద్దేశంతో.

"గోపాలయ్య డ్రైవర్ గాదు. మా గోపాలబావ," అన్నాను వుక్రోషంగా. మా అమ్మ మా అత్తా కిసుక్కున నవ్వారు. "బలే బావ దొరికినాడులే మా బక్కోడికి," అనింది మా అత్త. నాకు దెలీకనే నా కడుపున కూతురెపుడు బుట్టింది. దానికి మొగుడు యాణ్ణించి వూడి పడినాడురా... నా నాయినా..." అని నవ్వింది మా అమ్మ కొమ్మల నుంచి కరేపాకు రెమ్మలను వేరుచేసి మచ్చటంగా పెడుతూ. నేనేం మాట్లాడలేదు. కోపంగా కూర్చున్నాను, అక్కడే. వాళ్లు నన్నింక పట్టించుకోలేదు. గుప్పెడు గుప్పెడు కరేపాకు రెమ్మలను కట్టలుగా కడుతున్నారు.

"అమ్మాయా... యీ డ్రైవరు గోపాలయ్య కొంచెం మంచోడి మాదిరిగానే వుళ్లా," అనింది మా అత్త.

"యీ ముండలు యే కాలాన యేం పున్నెం జేసుకున్నాయోగానీ బంగారంటోడే దొరికాడు... కా," అనింది మా అమ్మ కరేపాకు రెమ్మలు మా అత్త ముందుకు తోస్తూ.

"వొకరి సొంటీ సోదీలేదు. తనేందో తన పనేందో. ఆ సొర్నలో యేం జూసినాడో యేమోగానీ కట్టుకున్నోడి కన్నా జాస్తిగానే వుళ్లా," అనింది మా అమ్మే మళ్లీ.

"నువు గెవనించినావా... గోపాలయ్య డ్రైవరు ఆ గడప తొక్కిన్నాటి నుండీ యిజయమ్మ యింటి తీరే మారిపోలా," అనింది మా అత్త.

"అదిగాదు కా... ఆ అమ్మకూతుళ్ల నోళ్లకి తపీమంటా బీగం పడిపోయింది జూడు," అనింది మా అమ్మ కరేపాకు రెమ్మల్ని నీళ్లబిందెలో ముంచి తీసి విదిలిస్తూ.

"వొక రచ్చలే... రావిడిలే... అరుపూ... కేకా... అసలది యిజయమ్మ యిల్లేనా అనిపిస్తా వుండాది అమ్మాయా," అనింది మా అత్త బోలెడు ఆశ్చర్య పడుతూ. తిరిగి తనే కొనసాగించింది. "ఆ మనిషి యేం తెచ్చేస్తా వుండాడో... యేం తింటా వుండాడోగానీ బయటికి పొక్కదే."

"తిన్నా తినకపోయినా ఆ మనుషుల్ది మొదుట్నుండీ అదే కత గదకా..." అనింది మా అమ్మ.

"అమ్మయా... మంచికో చెడ్డకోగానీ ఆ అమ్మా కూతుళ్లు డ్రైవరు గోపాలయ్యనే నమ్ముకోనుండారు. యే దినాన ఆ అబయ్య ఆ గడపెక్కినాడోగానీ యింకను యింకో మగమనిషిని ఆ యింటి నీడన గూడా జేరనీడం లేదు గదా," అనింది మా అత్త.

"చెప్పుకోవాల. అదిగూడ నిజమేను కా," అనింది మా అత్త.

కట్టిన కరేపాకు కట్టలన్నింటినీ గోతాంపట్ట మీద పెట్టింది మా అత్త. మిగిలిన కొమ్మల్ని ముందుకు లాక్కునింది, మా అత్త ముందుకి కొన్ని తోస్తూ. మా అత్త అరటి నారదీస్తూ, "అమ్మాయా... మొన్నొక దినం వొక తమాస కత జరిగింది చెప్పతా యిను," అని పళ్లు లేని నోటితో యింకోసారి నిండుగా నవ్వింది.

"మంచి యెండపూట, మెడ్రాసోడు వొకడొచ్చాడు. యాపచెట్టు కింద రిక్షా దిగాడు. అంతకు ముందు చానామాట్లు వొచ్చినోడే అనుకుంటా జంకూ గొంకూ లేకుండా అత్తింటికి అల్లిందినే దానికి వొచ్చిన అల్లుడు మాదిగా పెళ్లు దారిన యిజయమ్మ యింట్లోకి బోయినాడు.

"ప్యాంటూ, సర్టూ... మెడలో చెయినూ పైలా పచ్చీసుగా వుండాడు. నేనూ నీలవేణీ పందిట్లో కుచ్చే

నుండాం, యింకను జూడు యేం కత జరగబోతాదో అనుకుంటా. అంతే అమ్మయా...

''టెంకాయి పొరక తిరగేసి పట్టుకోని యిజి యమ్మ దూకింది జూడో... వనం గొరికే మాతమ్మే అనుకో... 'యెవుడ్రా నా బట్టా నువ్వు... నేరుగా యింటికి వొస్తా వుండావు... దొంగనాబట్టా... యెవురిల్లో... యేందో జూసుకోకుండా సంసారాలు జేసుకునే యిళ్లలోకి దూరె యిడమేనంట్రా... ఎదవ నాబట్టా... యేందొబ్బుక బోదా మనొచ్చినావురా...' అంటూ పెడీపెడీమని పీకింది. మెడ్రాసోడు బిత్తరకపోయినాడు. లగెత్తినాడు జూడో... వొచ్చిన రిక్షా వొదిలేసినాడు... పరుగో... పరుగు... యెన కాల్నే రిక్షావోడు 'మ్మో... మ్మో... వుండుమా మో...' అనరచుకుంటూ తగులుకున్నాడు. యిజియమ్మేం జేసిందా... మెడ్రాసోడ్ని వొదిలేసి... రిక్షావోణ్ణి యేసింది పొరకతో నాలుగు దెబ్బలు... 'యెదవ నాబట్టా... యిట్టాంటి నా బట్టల్ని యింకోతూరి నా యింటికి తీసకొచ్చినావంటే చీల్చి ఉప్పు పాతరేస్తా,' అంటూ తరుముకునేకొందికి వోడు రిక్షా లాక్కొని పరిగెత్తినాడు జూడో... సిన్మా జూసినట్టే బో...'' అని పడీ పడీ నవ్వింది మా అత్త. మా అమ్మ కూడా పనొదిలేసి నవ్వందు కునింది. కళ్లకు కట్టినట్టే చెప్పింది మా అత్త. నాగ్గూడా నవ్వు ఆగలా.

''బక్కమామా... యేం అర్థమయిందిరా నీకు,'' అనింది మా అత్త నవ్వు ఆపి.

నేనేం మాట్లాడలేదు. వాళ్లిద్దరూ పనిలో మునిగి పొయ్యారు. కొన్ని నిమిషాల పాటు యిద్దరి మధ్యా వొక్క మాట లేదు. ఆ నిశబ్దాన్ని భంగపరుస్తూ మా అత్త అనింది.

''అమ్మాయా... వొకిటి మాత్రం నిజం... యిజి యమ్మ మొహంలోగానీ, సొర్నమ్మ మొహంలోగానీ ముందుటి కళే లేకుండా పోయింది మే...''

''అవును కా,'' అనింది మా అమ్మ.

*

పొద్దు వాలుతోంది.

పసుప్పచ్చుటి బెంజిలారీ రేపిన దుమ్ము తెరల మీద సంధ్యకాంతి పచ్చగా ప్రతిఫలిస్తోంది.

చల్లని సముద్రపు గాలులు మొదలయ్యాయి.

ఆహ్లాదంగా వుంది రండి... యీ పక్కింటి రాతి తిన్నెల మీద కాసేపు కూచుందాం... నున్నటి రాతి తలగడాలు... అనుకోండి, హాయిగా.

శబ్దం చెయ్యద్దు. ఆగండి. ఆలకించండి. జాగ్రత్త గా చెవులొగ్గి....

యీ నాటు పెంకుటింటి నల్లజాజికొయ్య తలుపు వెనక నుంచి వినిపిస్తున్నవేవో శబ్దాలు... కిర్రు... కిర్రు చప్పుడులో కలగలిసిన మువ్వల ఘల్లు శబ్దాలు...

అయ్యో.. మీకేమీ వినిపించడం లేదా... బహుశా లేదేమో!

అవును, యిప్పుడీ నల్లజాజి కొయ్య తలుపు వెనక వుయ్యాలబల్ల లేదు.

వుయ్యాలబల్ల చేసే కిర్రు కిర్రు చప్పుడూ లేదు.

వుయ్యాలబల్ల మీద మువ్వల కాళ్లాడించు కుంటూ పాత పదాలేవో శ్రవ్య సౌందర్యంగా పాడుకున్న మనోరంజనవ్వ మాత్రం వుంది. యిక్కడి జీవితానికి యిప్పటికీ మిగిలిన సజీవ ప్రతీకగా. యిప్పుడామె నివాసం కోనేటి గట్టున.

అదిగో అప్పుడే మీ కనుబొమలు పైకి లేచాయి. నాకు తెలుసు, మీరామెను చూడాలనుకుంటున్నారు. మిమ్మల్ని నిరాశపరచను. రండి... బయల్దేరండి...

*

కోనేటిమెట్లు పాకుడు పట్టాయి. జారొచ్చు... జాగ్రత్త... ముళ్లకంపలు... జీలగముల్లు పదునెక్కువ... చూసుకోండి...

వాసన... తప్పదు, యిది ఆడవాళ్ల మరుగు ప్రదేశం.

అవ్వ బయటే వుంది. కుక్కి మంచం మీద.

తెల్లని వొళ్లంతా అల్లుకున్న సన్నని తీగల్లా ముడుతలు... ముడుతలు... తలంతా ముగ్గుబుట్ట. నుదిటి మీద యెర్రటి కుంకుమ బొట్టు. చేతుల నిండా గలగల శబ్దం చెయ్యని పాత గాజులు. యెర్రరాళ్లు పొదిగిన ముక్కు బేసరి. నడుం లేవదు. తొంభై యేళ్లు పైబడ్డాయి. అయినా జ్ఞాపకాలేం చెరగలేదు.

''యెవురాడా?''

''నేనవ్వా...''

''నువ్వంటబయా... బాగుండావా... యెప్పు డొచ్చావు...''

''నీ వొళ్లు బాగుందా అవ్వా.''

''మొక్క మాదిరి మొలిచే వుళ్లా యింకా, ఆయన రమ్మని పిలస్తే గదా నాయినా... కాసుకోనుండా ఆ పిలుపు కోసరం.''

''తొందరెందుకులే అవ్వా.''

''యేమిటికి నాయినా... యింకా బతికేమిటికి... ఈ ముళ్లకంపల్లో యీ పియ్యల దిబ్బల మద్దెనబడి... యేం... బతుకు నాయినా...? బతికినాం నాయినా.... మంచిబతుకే బతికినాం... మేం గూడా బతికినాం...

దేవళాన్ని నమ్ముకొన్నంతదాకా మంచి బతుకే బతికినాం. ఆడేది, పాడేది. సాదం ముద్దలు యేస్తే తెచ్చుకుని తినేది. ఆటా పాటా సాదన జేస్తా మంచి బతుకే బతికినాం. యే అయ్యకో వొకయ్యకి యిలాకాగా వుండి కష్టం సుకం పంచుకోని బతికినాం నాయినా... అంతా రాత... రాత అబయా.... ఆ ముదనష్టం ఆడర్ గదా యీ కాడికి దెచ్చింది. యింకన దేవాళాల్లో ఆడగూడ్దు, పాడగూడ్దు అని ఆడరేస్తిరి. మంచిదే... యింకన ఆడినామా... పాడినామా... ఆటా పాటా యింకనొద్దు... వొద్దనే వొద్దు మంచిదే. మేమేమన్నా తినింది అరక్క ఆడినామా, పాడినామా... యెప్పట్నిండో... మా అవ్వల అవ్వల ముందుట్నిండీ మా బతుకే యిదయిపాయె. వొద్దనే వొద్దంటిరి... ఆడనే అడొద్దంటిరి. యింత పిలకాయల కాణ్ణించీ సాధన చేసిన ఆటాపాటా వొద్దంటిరి. మంచిదే నబయా... యింకెట్ట బతకాల...?! సరే, వొకరికో యిద్దరికో యాడ్నో వొక దెగ్గిర మంచిదో చెడ్డదో యింత మడిచెక్క యిచ్చారు. మంచిదే.... మంచిదేనబయా... అన్నానని గాదుగానీ న్నాయం జెప్పు... నీడ పట్టున పుట్టి పెరిగినోళ్లం, గజ్జె గట్టి ఆడినోళ్లమేగానీ, మడకగట్టి దున్నినోళ్లమా... మా బతుకే యిదయిపాయ. మగదిక్కు లేని యిళ్లయిపాయ. రాయీ రప్పా యేరుకోని, చెట్టు చేమా కొట్టుకోని సేద్దం జేసే పని... ఆడ మనుషుల వల్లవునా...

న్నాయం జెప్పు... మంచయినా చెడ్డయినా న్నాయంగుండాల. తెలీందేముండాది... యీ వూరి కత... అప్పటికీ గెద్దలు మాదిరిగా కాపెట్టుకోనుంటిరే... యెగరేసుకోని బోతిరి. యెదాన బెట్టుకుంటిరి. యింకెట్ట బతకాల?

వొంటిమిందుండే నగనట్రా అమ్ముకుంటిమి. యింట్లో చెంబూ తపేలా అమ్ముకుంటిమి.

వుయ్యాల బల్లనిగాదు, పందిరి మంచాలూ బోసానం పెట్టెలా అమ్ముకుంటిమి. ఆకిరికి యిల్లూ వాకిలీ గూడా యెవురి కడుపున బెట్టుకున్నారు నాయినా... చిన్నోడివయినా అడగతా వుండా... న్నాయం జెప్పాల.... యీ దినం యీ పొద్దుటికి... బోగమనేది బోగవోళ్లకి మిగిలుండాదా అనడగతా వుండా... న్నాయం జెప్పు. వొక్క సొర్నమ్మ యిల్లు దప్ప ఆ వొరస వొరసంతా యిళ్లలో వుండేదెవరు? ఆయన్నీ ఆ కుంటి మున్సిబు కెట్టొచ్చినాయి. యాడ మడగ్గట్టి యే బూములు దున్ని యెంత చెమట గార్చినాడు? అడగతా వుండా ముసిల్దాన్ని. చెప్పు నాయినా...?''

''అది సరేగానీ, అవ్వా.... సొర్నక్క యిల్లు మాత్రం యెట్లా మిగిలింది?''

''యెట్టంటే... ఆ అమ్మా కూతుళ్లు అంతంత నోళ్లు బెట్టుకోబట్టి గదా!''

వూరికంతా మంచయిపొయ్యి మేమేం జవురుకున్నాం నాయినా... వాళ్లు చెడ్డయి పొయ్యి చెడిపొయ్యే దానికి... ఆ ఆడ మనుసుల మీద బడి వూరంతా నోరో... నోరో... అని కొట్టుకుంటిరే... ఆ నోరే గాన లేకుంటే ఆ జానెడు నేలయినా మిగిలుణ్ణా ఆ సొర్నమ్మకి. యెవురికి దయగలిగి నాయినా యింత ముద్దేసేది యీ కలిగ్గంలో... నోరుగల్ల ముండలు... నోరుగల్ల ముండలు... అని యిదే పాటయిపాయ ఎవురికి బట్నా... యేం నోరు బెట్టుకోని యెవురి ఆస్తులు దోసి దాపెట్టుకున్నారని వాళ్లు. మంచో చెడ్డో వాళ్ల బతుకు వాళ్లు బతకతా వుంటే 'ఛీ ఎదవ,' లంటిరి. సరే, ఆ గోపాలయ్య లారీ యాక్సిడెంటులో చచ్చిపోయినాకయినా ఆ బిడ్డ... ఆ బిడ్డ... పాత బతుక్కి పాలుమారిందా? మనేదతో మంచానబడి ఆ యిజియమ్మ బొయ్యె. పుణ్ణెం జేసుకునిందబయా... పుట్టినతావులోనే వూపిరొదిలింది. మాకా ప్రాప్తం గూడా లేకపోయానే... యీ పియ్యదిబ్బల మింద దేక్కుంటా దేక్కుంటా... వాకిట్లో యిన్ని నీళ్లు బోసే దిక్కు గూడా లేకుండా కాకులు గెద్దలకి బడేగదా...'' గొంతు రుద్ధమయిపోయింది. సన్నని వణుకు... అలలు అలలుగా ఆ వొణుకు ఆమె శరీరమంతా వ్యాపించింది. కళ్లు ఎర్ర జీరలు కమ్మాయి. ''యెతిమతం బిడ్డతో ఆ సొర్నమ్మా యెట్ట బతకాల? యెవురి మీదన్నా బడిందా, యెవర్నన్నా యెరకలాడిందా...? గొడ్లెనక దిరిగి పేడ యేరుకొచ్చి పిడకలు తట్టుకునె. యిడ్లీలనీ వడలనీ మురుకులనీ కాల్సుకోని యానాది పాళాన తిరిగి అమ్మతా వుండె... అయినా గుట్టుగా ఆ యమ్మని బతకనిస్తా వుండారా... నా మాదిరిగా ముసల్దిగాదే... ఆడలాగీ... యీడలాగీ... తింటా వుండాదంటే ఆ నోరుండబట్టే గదా...? ఆ నోరు బెట్టుకోకపోతే యీ వూళ్లో నిలవ నీడుణ్ణా ఆ యమ్మికి? యీ పొద్దుటికి గూడా ఆయమ్మి మౌనంగా బతకతా వుండాదంటే ఆ నోటివల్లే నాయినా...''

చీకటి తెరలు తెరలుగా ముసురుకొస్తాంది. మనోరంజనవ్వ ముఖం మీద నీడలుగా అది ప్రతిఫలిస్తోంది. కానీ ఆమె కళ్లల్లో మాత్రం- సొర్నక్క ప్రస్తావన వల్ల వచ్చిన వెలుగు తళుకులీనుతోంది...

*చూపు కథల ప్రత్యేక సంచిక, నవంబర్-డిసెంబర్ 2000*